# అమ్మకొడుకు

ఆదూరి వెంకటరమణమ్మ



పదవ తరగతి చదువుతున్న నాకు, ఆడది దాటిపోయిం తరువాత వెనక్కి తిరిగి ఆమెవేపు చూడాలనే కోరికని ఎవరికంటా పడకుండా తీర్చుకోవాలనే వయసు వచ్చింది.

ఒకటి రెండుసార్లు రమణమ్మను పంపు దగ్గిర నీళ్ళు పట్టడం చూశాక ఎందుకో ఆమెను మరీ మరీ చూడాలనిపించింది. ఆమె ఒంగొని పని చేస్తుంటే నా గుండె గుబ గుబ లాడుతుంది. రమణమ్మ మా పని మనిషి రంగమ్మ కూతురు.

రంగమ్మకు సుస్తీగా ఉంటే పనిచేయడానికి రమణమ్మే మా ఇంటికొస్తుంది. రంగమ్మకు జబ్బులు రావాలని మొక్కేవాడ్ని రమణమ్మను చూడ్డానికి. రమణమ్మ వయసు మహావుంటే పద్నాలుగు సంవత్సరాలుంటాయేమో ?

రంగమ్మ పనిచేయడానికి మా ఇంటికొచ్చిన రోజు నాకు పని తగిలి పోస్టాఫీసుకి పోవాల్సొస్తే రంగమ్మ ఇంటి ముందుగా పోవాలనిపించేది. స్నేహితుడి ఇంటికి వెళ్ళాలనిపిస్తే రంగమ్మ ఇంటిముందుగా పోవాలనిపించేది. రమణమ్మ కనిపిస్తుందేమోనన్న ఆశ, వంటిగా వాళ్ళింటి దగ్గిర.

రమణమ్మ వాళ్ళ ఇంటిముందు ఏ ముగ్గులు పెడుతూనో కనిపిస్తే ఆమె పెట్టిన ముగ్గుల మీద నుండి నడిచివెళ్ళి ఆమెలోని కోపాన్ని చూడాలని అనిపిస్తుంది.

అవకాశం కుదిర్తే ఆమె కళ్ళలోనికి చూస్తూ - ఆమె కళ్ళు దించుకొనేవరకూ చూస్తూండేవాణ్ణి.

రోజూకంటే ఇప్పుడు 'ట్రిమ్'గా తయారయి రమణమ్మను పదే పదే చూడాలన్న కోరిక బలపడసాగింది. ఆమెను రోజుకో పర్యాయం అయినా చూడకపోతే ఏదో వెలితిగా ఉంటుంది.

ఆమెతో మాటలు కలుపుదాం అంటే సిగ్గుగా, భయంగా ఉంటుంది. ఎవరైనా చూస్తారేమోనని మరో వంక. ఆమెతో ఏదోటి మాట్లాడాలని, ఆమె వేపే అలా గంటలు తరబడి చూస్తూ గడిపేయాలని ఎన్నో ఆశలు.

స్కూలు నుండి ఇంటికొచ్చేసరికి అంట్లు తోముతూ రమణమ్మ కనిపించింది. ఆనందం నాలో నరనరానా ప్రవహించింది.

స్కూలు నుంచి వస్తూ రమణమ్మ ఇంటి ముందునుండే వచ్చాను. రోజూ నేనొచ్చే టైముకి ఇంటిముందు కనిపించే రమణమ్మ

కనిపించకపోయే సరికి మనసు తెగ బాధ పడింది.

ఇంట్లో అంట్లు తోముతూ కనిపించేసరికి నన్ను నేనే మైమరచి పోయాను ఆ సంతోషంలో.

కాలి పిక్కల పైదాకా పరికిణీ ఎత్తి ఒళ్ళో దోపుకుంది. కాళ్ళకు పసిమి వన్నె పసుపు ఎక్కువే పూసింది.

నన్ను చూసి తోముతున్న గిన్నె పక్కన పెట్టి పరికిణీతో కాళ్ళను పూర్తిగా కప్పేసుకుంది. ముసిముసిగా నవ్వుతూ.

ఆ సమయంలో ఆమెను చూస్తుంటే ఏమో అయిపోవాలనిపిస్తోంది. మెదడు పనిచెయ్యడం పూర్తిగా మానేసింది ఆమెతో ఒక్కమాట మాట్లాడకుండా గబగబ మెట్లెక్కి మేడమీద నా గదిలోనికి పోయాను విసురుగా. అయోమయంగా. ఆమె ఎదురుగా ఉంటే ఏం చేస్తున్నానో నాకే తెలీదు.

పుస్తకాలను టేబిల్ మీదకు విసిరేసి తల తొందరగా దువ్వుకున్నాను అర్థం, పర్థం లేకుండా

బాల్కనీలోనికొచ్చి పెరట్లోనికి చూసాను. రమణమ్మ పని చేస్తూనే మధ్య మధ్య మేడ మీదకు చూస్తోంది. నన్ను చూసి తలదించుకుంది ఎందుకో.

అమ్మలోపల ఎవరితోనో మాట్లాడుతోంది. రమణమ్మ వేపు నడిచాను. గుండెల్లో ఒకటే గుబులు.

రమణమ్మ నా వేపు కావాలనే చూడ్డం లేదు. దగ్గరకు వెళ్ళి కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిమన్నాను కొంచెం చొరవగా.

కాళ్ళు కడుక్కునే అలవాటు నాకు ఎక్కువగా లేదు. నీళ్ళు అందించింది రమణమ్మ. పేంట్ కొంచెం పైకెత్తి కాళ్ళమీద నీళ్ళు గుమ్మరించాను. కావాలనే, రమణమ్మ మీద నీళ్ళు తూలాలనే అలా చేశాను.

నీళ్ళు పడినా ఏంమాట్లాడలేదు రమణమ్మ. చెంబుని రమణమ్మ ప్రక్కనే దభేల్నపడేసి వెళ్ళిపోవడానికి వెనుతిరిగాను.

"చిన బాబూ కాలికి బొల్లిలున్నాయి. సరిగ్గా కడుక్కోండి" పని మనిషి రంగమ్మ కూడా చినబాబనే పిలిచేది నన్ను.

"నాకు కడుక్కోడం రాదు. కడిగిపెట్ట రాదూ ? " అనేసాను ధైర్యంగా. రమణమ్మ ఏమీ మాట్లాడలేదు.

"పని మనిషిచేత కాళ్ళుకూడా కడిగించుకుంటావ్ ? అంటూ అమ్మ రావడంచూసి బిక్కచచ్చిపోయాను.

పరుగుతో మేడమీదకు పోయాను. మేడ మీదనుండి తొంగిచూస్తే రమణమ్మ ముసిముసిగా తనలో తాను నవ్వుకుంటోంది.

"త్వరగా కానీయ్ అంట్లు తోమడం మేం సిన్మాకెళ్తున్నాం" అన్న అమ్మ మాటలు విని ఓప్లాన్ వేశాను.

"రమణమ్మకు,

నువ్వంటే నాకు చాలా ఇష్టం. అమ్మావాళ్ళు సిన్మాకెళ్తున్నారు. పది గంటలదాకా రారు. ఎలాగయినా నువ్వు రాత్రి ఎనిమిదిన్నరకు సత్రం వెనక్కురా. అక్కడ నీతో చాలా మాట్లాడాలి వస్తావుగా మర్చిపోకు.

ఇట్లు

ఆర్. అనంతం"

ఉత్తరం రాసి మడిచి జేబులో పెట్టుకున్నాను. అర గంటలో అమ్మా పక్కింటి వాళ్ళు సిన్మాకి బయల్దేరి వెళ్ళిపోయారు. నన్ను అమ్మ రమ్మనిపిలిచింది, ఆ సిన్మా నేను చూసేసానని తప్పించుకున్నాను. ఇంట్లో రమణమ్మ ఒక్కర్తే ఉంది. మొక్కలకు నీళ్ళు పోస్తోంది.

చిన్న గులక రాయితీసి మేడమీద నుంచే విసిరాను గురితప్పలేదు. సరిగ్గా వెళ్ళి ఆమె పిరుదు మీద తగిలింది. తగిలిఁదగ్గర చేత్తో త డు ము కుం టూ మేడమీదకు చూసింది. రమ్మని చొరవగా చెయ్యి ఊపాను.

రానన్నట్టు తల అడ్డంగా ఊపింది. ఏం జేస్తానో చూడు అన్నట్టు చూపుడు వ్రేలితో వార్నింగిచ్చాను.

అవేం లక్ష్యపెట్టకుండా మొక్కలకు నీళ్ళు పోస్తోంది రమణమ్మ. నా వైపు చూసినప్పుడల్లా రమ్మని చెయ్యి ఊపుతూనే ఉన్నాను.

ఆఖరికి ఓ సారి ఎందుకన్నట్టు పిడికిలి బిగించి సంజ్ఞ చేసింది. దగ్గరకు రా అని చెయ్యి ఊపాను.

మేడ దిగువ భాగం వరకూ వచ్చి 'ఏం' అంది. పైకిరా అన్నాను. నేను రాను అంటూ వెనక్కి తిరిగింది.

'ఆగాగు' అంటూ జేబులోని ఉత్తరాన్ని క్రింద పడేసాను. కాగితాన్ని అందుకొని విప్పిచూసి మడిచి జాకెట్టులో దాచుకుంది.

నరాలు జివ్వుమన్నాయి ఆ చర్యకు. వెంటనే స్ఫురించింది. "అరె" రమణమ్మకు చదువురాదే" అని. గబగబా మెట్లు దిగాను. అప్పటికే రమణమ్మ లేడిలా గెంతుతూ పారిపోయింది.

ఆ రాత్రంతా దిగులుగా వుంది మనసంతా. ఆ ఉత్తరాన్ని ఎవరికైనా చూపిస్తుందేమోనని, రభస జరుగుతుందేమోనని.

ఉదయం కొంచెం ఆలస్యంగా లేచాను. రాత్రి సరిగా నిద్ర పట్టలేదు. పట్టిన నిద్రలో అన్నీ రమణమ్మ కలలే

సాయంత్రం మళ్ళీ స్కూలు నుంచి ఇంటికొచ్చేసరికి రమణమ్మ గిన్నెల ముందుంది తోముతూ. ఆమెను చూసిన ఒక్కక్షణం కాళ్ళు తడబడ్డాయి. గుండె ఝల్లుమంది. అమ్మ అలికిడేం వినిపించడం లేదు.

"అమ్మ ఎక్కడికి వెళ్ళింది ?" చూడ్డానికి సిగ్గుగా ఉన్నా ధైర్యం చేసి అడిగేసాను.

"కామాక్షమ్మగారితో గుడి కెళ్ళారు."

ఆ సమాధానం కొండంత ధైర్యాన్నిచ్చింది. రమణమ్మను కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిమ్మన్నాను. రమణమ్మ నీళ్ళు అందిస్తూ "రాత్రి రాలేదేం?" అంది. స్థాణువైపోయానామె ప్రశ్నకు.

"అ... ఆ వుత్తరం ... నీకు చదువు" మాటలు తడబడ్డాయి.

మళ్ళీ ఆమె అంది "వరలక్ష్మి మా పిన్ని కూతురే. ఎనిమిదిదాకా చదివింది. మా ఇద్దరి మధ్య దాపరికాలుండవు. అది మీ రాసిన ఉత్తరం చదివి చెప్పింది. అది సరే కాని రాత్రి మీ కోసం ఎంతసేపు చూసానో. రాలేదేం?" రమణమ్మ మాట్లాడుతుంటే ఆమె బుగ్గల్లో కెంపులు మెరిసాయి.

"రాత్రి నువ్వు వస్తావనుకోలేదు.అందుకే రాలేదు. ఈ రాత్రికి తప్పకుండా వస్తాను. మరి నువ్వూ వస్తావా?" అన్నాను కాళ్ళు తడబడుతున్నా.

"వస్తాన్లే. మీ అమ్మగారొస్తున్నారు. తొరగా మేడ మీదకు పొండి" అంది.

మేడ మీదకు ఒక్కగెంతులో పోయాను. నా ఆనందం మాటలలో చెప్పనలవికానిది. ఒంటరిగా రాత్రి సమయంలో ఆడదానితో ఆ భావంతో ఎప్పుడూ కల్సుకోలేదు. అంతలోనే భయం, సిగ్గు, ధైర్యం వొణుకు.

రాత్రి ఎనిమిదయింది.

అనుకున్న ప్రకారం మరో అరగంటకు రమణమ్మ వచ్చింది. నిజంగా ఆ చిరువెన్నెల్లో పాలరాతి బొమ్మలా అందాలు విరజిమ్ముతూ వచ్చి నా ప్రక్కనే నించుంది.

నా కాళ్ళూ చేతులూ, గుండె ఒకటే ఒణుకు-పలపు వొణుకు.

ఎలాగయితేనేం, మాటలు లేకుండానే ఆమె జబ్బల చుట్టూ చేతులు పోనిచ్చి గుండెలకు గట్టిగా అదుముకున్నాను.

రమణమ్మ గువ్వలా, పువ్వులాగా నా హృదయంలో ఒరిగి పోయింది.

పది గంటల వరకూ, ఆ సత్రం పచ్చిక మీద వెల్లకిల్లా పడుకున్న రమణమ్మ కళ్ళ లోని చంద్రబింబాల్ని చూస్తూ గడిపాను.

ఉదయం లేవగానే పైకొచ్చి చూసే సరికి పిక్కల పైదాకా పరికిణి బిగించి కళ్లాపి జల్లుతోంది రమణమ్మ.

ఆమె పిక్కలని చూసేసరికి నాలో సిగ్గు తెరలు క్రమ్మాయి. క్రిందికి వెళ్ళి మొహం కడుక్కొని ఆమె వైపు తలెత్తి చూసాను. బుగ్గమీద గాటు మా మొదటి రాత్రి స్మృతిగా అలాగే అది జీవిత కాలం ఉండిపోతుంది. స్త్రీలో ఎంత అకర్షణ.

రెండు రోజుల కొకసారియినా సత్రంలో ఈ తతంగం జరుగుతూనే వుంది. రమణమ్మ అంటే ఓ ప్రత్యేకమయిన అభిమానం నా మనసులో ఏర్పడింది. అది అంతకంతకూ హెచ్చుతునే వుంది.

* * *

ఇంటర్‌లో జాయినయాను పచ్చి హేను మైళ్ళున్న పట్నంలో. కాలేజిహాస్టలో దిగాను, రమణమ్మను మరిచిపోకుండానే.

మా కలయిక గురించి ఊళ్ళో చెప్పుకుంటున్నట్టు తెల్సింది. దొంగ పడ్డ ఆర్నెల్లకు కుక్క మొరిగినట్టు. మొదట ఆ మాటలకు బాధపడ్డా, తేలిగ్గా తీసుకోవడం అలవాటు చేసుకున్నాను. కాలేజి నుండి సెలవు దొరికినప్పుడల్లా ఇంటికి వెళ్ళాలనిపించినా ఊళ్ళో పుకారులను బట్టి వెళ్ళకుండా ఉండి పోయేవాడ్ని.

మా ఇంటికి రమణమ్మ రావడం లేదని ఓ కు రాడి ద్వారా తెలిసింది. రంగమ్మ చనిపోయిందట. రంగమ్మ మొగుడు పకీరు ఎక్కడో ఉండేవాడు. ఆ విషయం తెల్సుకొని వచ్చి రమణమ్మను బలవంతంగా లాక్కుపోయాడట ఏ ఊరో.

కాలేజీలో రోజులు యాంత్రికంగా గడుస్తున్నాయి. ఆ తరుణంలో ఉషతో పరిచయం ఏర్పడింది. కాలేజి లేనినాడు కూడా ఉష వాళ్ళింటి కెళ్ళి అదీ ఇదీ మాట్లాడి రావడం ఎందుకో హాయి అనిపించేది. ఆ హాయి సంవత్సరం తిరక్కుండానే ప్రేమగా మారి పెళ్ళిదాకా వచ్చింది. ఉషవాళ్ళ కులం మాదీ ఒకటే కావడం మూలంగా మా కుటుంబానికి సరిపోయే సంబంధంగా అమ్మావాళ్ళు భావించి పెళ్ళి జరిపేశారు. ఊళ్ళో పాత పుకారు మూలంగా అమ్మ తొందర పడిందని నా ఉద్దేశం.

పెళ్ళయింతరువాత ఉష చదువు మానేసింది. హాస్టల్ విడిచి వేరే పోర్షనులో అద్దెకుంటూ చదువు-సంసారం వెలగబెడుతున్నాను. ఇలా చెయ్యడానికి ముఖ్య కారణం అమ్మ. నా చదువు పాడయి పోయినా ఫరవాలేదని అమ్మ అభిప్రాయం.

ఇంటర్ తరువాత డిగ్రిలో చేరాను.

రమణమ్మ గురించి బాధగానే ఉంది మనసులో.

రమణమ్మను లాక్కెళ్ళిన ఫకీరు ఎవడికో ముడిపెట్టడానికి చూసాడట, రమణమ్మ ఎంత వారిస్తున్నా వినిపించుకోకుండా, బలవంతంగానే ఒకడు ఆమె మెళ్ళో తాళి కట్టాడట. రెక్కలు విరిచి కట్టి "శోభనం" గదిలోనికి రమణమ్మను నెట్టారట. మంగళసూత్రం ఆ గదిలోనే త్రెంచి మొగుడి మొహాన కొట్టి—మీదికి ఆకలి సింహంలా వస్తున్న మొగుడ్ని ఇనపరాడుతో కొట్టి అక్కడ్నించి తప్పించుకొని మా యింటికొచ్చేసిందట. పని మనిషిగా మళ్ళీ జీవితాన్ని ప్రారంభించిందట. రమణమ్మకోసం తర్వాత అక్కడకు ఎవరూ రాలేదట.

ఇదంతా డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నప్పుడు తెల్సింది. ఇప్పుడు ఉషకు నాలుగో మాసం కూడా.

నన్ను చకితుణ్ని చేసిన సంగతి మరొకటుంది.

ఆమెకు పెళ్ళి కాకముందే ఓ కొడుకు పుట్టి పోయాడట. ఆ కొడుకు నా మూలంగా పుట్టాడని కొందరను కున్నట్టు తెల్సింది. ఏ మైనా నాకు రమణమ్మ విషయం చికాకుగా తయారయింది.

పండగలక్కూడా సొంత ఊరు వెళ్ళాలంటే ఏదో దిగులుగా ఉండేది. ఎక్కడ రమణమ్మ కన్పిస్తుందోననీ భయం.

అమ్మావాళ్ళు ఈ పండక్కి తప్పకుండా రావాలని రాసారు. అయిష్టంగానే ఉషతో బయల్దేరాను.

ఇంటికి వెళ్ళగానే నాకు ముందుగా కన్పించింది రమణమ్మ. ఆమెలో పూర్వకళ లేనేలేదు. జారిపోయిన యవ్వనం, కళ్ళ క్రింద నలుపు, కాయకష్టం చేత నునుపు తగ్గిన శరీరం. ఎక్కడా సెక్స్‌ను ప్రేరేపించే నాజూకుతనం ఆమెలో లేదు.

ఆమెను చూస్తుంటే ముళ్ళమీద కూర్చున్నట్టుండేది. నన్ను చూస్తున్న ఆమెకళ్ళలో ఎందుకో "మెరుపు" కన్పించేది. సాయంత్రం వరకూ ఇద్దరం చాలాసార్లు తారసపడ్డప్పటికీ పలకరించుకో లేదు.

సాయం సంధ్య చీకట్లు అలుమూకుంటుండగా రమణమ్మ గబగబ నేనున్న మేడ మీదకు వచ్చి ఒక చీటిని ఒళ్ళోకి విసిరి వచ్చిన వేగంతో దిగిపోయింది.

ఈ హఠాత్సంఘటనకుహతాశుడ్నయాను.

ఆమె విసిరిన చీటిని విప్పాను.

"నేననుకున్నట్టే వచ్చారు. మీ పెళ్ళి అత్త వారింట్లో అయిందట అప్పుడు నేను లేను. నా గురించి మీకు తెలిసే వుంటుంది. అంచేత రాలేకపోయాను. ఈ రెండేళ్ళలో అప్పుడప్పుడొచ్చినా నాకు కనిపించకుండానే పోయేవారు. ఈ జన్మకు మీతో మాట్లాడం పడదనుకున్నాను. మిమ్మల్ని మళ్ళీచూస్తానో లేదో అనుకున్నాను. కాని మీ అమ్మగారు "గట్టిగా రాస్తాను ఈ పండక్కి రమ్మన" మని ఎవరితోనో చెప్పడం విని పొంగిపోయాను. మీకు తెలుసోతెలీదో నాకో కొడుకు పుట్టాడు మీ వల్ల. కానీ పెంచే యోగ్యత లేకపోయింది. మీకు పండంటి బిడ్డ కలగాలి.

మీతో ఎన్నో మాట్లాడాలని ఉంది. ఈ ఉత్తరం పెళ్ళయి కాపురం చేసునుంటున్న వరలక్ష్మి చేత రాయిస్తున్నాను, సిగ్గు ఒదిలేసి. రాత్రి ఎనిమిదిన్నరకు సత్రం వెనక్కి రండి ఎన్నో మాట్లాడాలి. వస్తారని చూస్తాను.

మీ

రమణమ్మ."

ఉత్తరం చదివే సరికి ఎవరో కడుపులో చేయి పెట్టి దేవినట్లయింది.

మనసుకూ నాకూ జరిగిన సంఘర్షణ అనంతరం—అనంతమే గెలిచాడు.

ఉషను కేకేసి 'రెడీ' కమ్మన్నాను.

"ఎక్కడికండీ టైము అరయితే" అంది.

"ముందు డ్రెస్ చేసుకో" అరిచాను.

భయంగా పోయి డ్రెస్సు చేసుకొచ్చింది. వెళ్ళి రిక్షాలో కూర్చున్నాం.

రిక్షా కదిలింది.

మనసులో అన్నీ రమణమ్మ ఆలోచనలే.

రిక్షాని పంపేసి బాల్కనీ టిక్కెట్స్ ఇచ్చే బుకింగ్ వేపు నడిచాం—నేను ఉషా కలిసి లక్ష్మీటాకీస్ ఆవరణలో. *